క్లుప్తంగా

'మహాసభలను విజయవతం చేయాలి'



పాలకుర్తి టౌన్: ఈనెల 9వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ ప్రథమ మహాసభలను విజయవతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గుమ్మడిరాజుల సాంబయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సాంబయ్య మాట్లాడారు. దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులు సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నెకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా కాట శ్రీనివాస్, కొనకటి కళింగరాజు, గౌరవ అధ్యక్షుడిగా బొమ్మిశెట్టి సోమ నర్సయ్య, ఉపాధ్యక్షులుగా రాజ్‌మహ్మద్, వంగా అశోక్, సహాయ కార్యదర్శులుగా మునిగే అశోక్, తుడి రంజాన్, కోశాధికారిగా చెరుపెల్లి అఖిల్ తోపాటు 25 మంది సభ్యులు ఎన్నికయ్యారు. సమావేశంలో రవికుమార్, కృష్ణ, యాకన్న, రాజు పాల్గొన్నారు.

అరూరి రమేశ్‌కు పలువురి పరామర్శ



జఫర్‌గఢ్: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు అరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల ఉప్పుగల్లులో మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని అరూరి రమేశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్‌రెడ్డి, గటిక విజయ్‌కుమార్, ప్రముఖ వైద్యుడు రంజిత్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్లు ఊకంటి వనంరెడ్డి, మల్లారెడ్డి, జక్కు రమేశ్‌తో పాటు సీనియర్ పాత్రికేయులు శ్రీధర్‌రెడ్డి, వేముల నాగరాజు, సుధాకర్, సదానందం, ప్రభాకర్ ఉన్నారు.


ఇసుక ట్రాక్టర్ సీజ్

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆకేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బచ్చన్నపేట: బైక్‌పై వెళ్తూ కుక్క అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం కొడవటూర్‌లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. కొడవటూర్ గ్రామానికి చెందిన నడిగొట్టు లింగం(40) హైదరాబాద్‌లో కుల వృత్తి మంగలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తల్లి నాగమ్మకు ఇటీవల పక్షవాతం వచ్చింది. కాగా, ఈనెల 4వ తేదీన ఆస్పత్రిలో తల్లిని చూపించి కొడవటూర్‌లో దింపి బైక్‌పై హైదరాబాద్ బయలుదేరాడు. ఈ క్రమంలో యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. స్థానికులు లింగంను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల నిమిత్తం కొడవటూర్‌కు మృతదేహాన్ని తీసుకొచ్చారు. మృతుడికి భార్య వనిత, కుమారుడు, కూతురు ఉన్నారు.

జాతర బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల బందోబస్తు ఏర్పాట్ల కోసం బుధవారం ఎస్సై దూలం పవన్‌కుమార్ ఆలయంలోని స్వామివారి కల్యాణ మండపం, మెట్ల మార్గం, ఘట్‌రోడ్డు క్యూలైన్ ఏర్పాటు కోసం పరిసరాలను పరిశీలించారు. ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకుడు దేవగిరి అనిల్‌కుమార్, సిబ్బంది ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల కింద చెట్లు

● ట్రాన్స్‌కో అధికారులకు తప్పని తిప్పలు

లింగాలఘణపురం: ఉపాధి హామీ పథకంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు విద్యుత్ లైన్ల కింద నాటడంతో ట్రాన్స్‌కో అధికారులకు ప్రతి ఏటా తిప్పలు తప్పడంలేదు. నాటిన మొక్కలు పెరిగి పెద్దవై చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగడంతో లైన్ ట్రిప్ కావడం, కొన్ని సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కాలిపోవడం జరుగుతోంది. దీంతో ప్రతి సంవతసరం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ప్రీ మాన్‌సూన్ ఇన్‌స్పెక్షన్(పీఎంఐ) నిర్వహిస్తున్నారు. ఇందులో లైన్ కింద చెట్లను, కొమ్మలను నరికివేస్తున్నారు. ప్రతి ఏటా ఒకే లైన్‌లో చెట్లను నరకడం జరుగుతోంది. మండలంలోని నెల్లుట్ల–లింగాలఘణపురం రోడ్డులో ఉన్న నెల్లుట్ల సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరిగే 3 కేవీ లైన్‌లో సుమారు ఎనిమిది ఏళ్లుగా చెట్లు, కొమ్మలను తొలగిస్తున్నారు. ఇకనైనా ఉపాధి హామీ పథకంలో నాటే మొక్కలు విద్యుత్ లైన్ల కింద నాటవద్దని ట్రాన్స్‌కో అధికారులు కోరుతున్నారు.



33 కేవీ లైన్ కింద ఉన్న చెట్లును తొలగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

తాగునీటి సమస్యలుంటే చెప్పండి

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్

లింగాలఘణపురం: గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని మాణిక్యాపురం, ఏనెబావి, మంథోనిగూడెంలో తాగునీటి సమస్యపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్, సంప్‌లో సరఫరా అవుతున్న నీటి సరఫరాను సందర్శించారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ నెల 1వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామాల్లో పర్యటించడం జరుగుతుందని, అందులో భాగంగా మాణిక్యాపురంలో సమస్యను తెలుసుకోవడం జరిగిందన్నారు. మండలంలో ఎక్కడైనా సమస్య ఉంటే తెలియజేయాలని కోరారు. ఎంపీఓ రఘురామకృష్ణ, జీపీ కార్యదర్శి శ్రీవాణి, వాటర్‌మెన్ రవి తదితరులు ఉన్నారు.



ఓహెచ్‌ఆర్‌ను పరిశీలిస్తున్న డీఈ వేణుగోపాల్

19 ఏళ్లలోపు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు

● మండల వైద్యాధికారులు

రఘునాథపల్లి/బచ్చన్నపేట/తరిగొప్పుల/పాలకుర్తి: ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు బాల బాలికలందరికీ నూరు శాతం ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని మండల వైద్యాధికారులు సూచించారు. బుధవారం పలు మండల కేంద్రాల్లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. బాలబాలికలకు నులిపురుగుల నివారణ కు ఆల్బెండజోల్ మాత్రలు సింగిల్ డోస్ టాబ్లెట్లు మాత్రమే ఇవ్వాలని, వాటి పంపిణీపై పలు సూచనలు చేశారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. మండల వైద్యాధికారులు కమల్‌హాసన్, సృజన, ఉదయ్ కిరణ్, సిద్దార్థ రెడ్డి, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీఓ మాలతి, ఎంఈఓలు ఇర్రి వెంకట్‌రెడ్డి, నెల్లుట్లజానకి, డాక్టర్లు, సూపరింటెండెంట్లు, సీహెచ్‌ఓలు, హెచ్‌ఈఓలు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: మాట్లాడుతున్న మండల వైద్యాధికారి డాక్టర్ కమల్‌హాసన్

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తేవాలి

● ఆదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

దేవరుప్పుల: ఇంటింటా ఉచిత విద్యనందించే ప్రభుత్వ లక్ష్యసాధన కోసం ఉపాధ్యాయులు, గ్రామస్తులు తోడ్పాటు అందించి పూర్వవైభవం తేవాలని జిల్లా ఆదనపు(స్థానిక సంస్థల) కలెక్టర్ పింకేష్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని కోలుకొండ, ధర్మాపురం, పెద్ద మడూరు, చిన్నమడూరు హైస్కూళ్లు, దేవునిగుట్ట, ధారావత్ తండా అంగన్‌వాడీ కేంద్రాల్లో తలపెట్టిన ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద కేటాయించిన నిధులు వినియోగంపై ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల వసతికి అవసరమైన మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటీ వసతి, గ్రావెల్ ఫిల్లింగ్ మొదలగు పనులను చేయించడానికి ఒక్కో పాఠశాలకు రూ.2 లక్షలు కేటాయించినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులను సమకూర్చుతున్న క్రమంలో ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, ఎంఈఓ జి. కళావతి, డీఈ రామలింగాచారీ, ఎంపీఓ సురేష్ కుమార్, ఏఇ మహేష్, ప్రధానోపాధ్యాయులు శివాజీ, వెంకన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, సావిత్రి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన పింకేష్‌కుమార్

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకుంది. కాగా, గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయ కమిటీ భక్తుల సహకారంతో పునర్నిర్మాణ పనులను చేపట్టారు. ఈ క్రమంలో భక్తులు నర్మెట ముదిరాజ్ సంఘం రూ. 30,116లు, చౌదరీ నర్సారావు (రాజస్థాన్ హోటల్) రూ. 16,116,లు, రామిడి నర్సింహారెడ్డి రూ. 11,116 లు, బొక్కా సంపత్ రూ. 10,116లు, బైరగోని రాజ్‌కుమార్ (కేఎస్‌ఆర్ గార్డెన్స్) రూ. 11,116లు, గొలుసుల కరుణాకర్ కల్పన దంపతులు (కర్ణ ఫోటో స్టూడియో) రూ. 10,116లు, పండ్ల బాలనర్సయ్య రూ. 5,116 లు బుధవారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో జంగిటి అంజయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులి మధుసూదన్, బండి సిద్దులు, బోయిని లింగం, పులి ఉపేందర్, పండుగ రాజారాం, గొడుగు రవి, గొట్టె రాజశేఖర్, ఆరె ప్రవీణ్, కనకయ్య, కరుణాకర్, నాగరాజు, బండి అశోక్, ప్రెజ్ఞాపురం శ్రీధర్, కల్లూరి గణేష్, కొండ బాలయ్య పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం'



సమావేశంలో సమన్వయ కమిటీ ప్రతినిధులు

దేవరుప్పుల: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసి పార్టీ సత్తాచాటుదామని ఆ పార్టీ మండల సమన్వయ ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పెద్ద తండా, చిన్నమడూరులో ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, పాలకుర్తి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన గ్రామ స్థాయి కార్యకర్తల సమావేశాల్లో వారు మాట్లాడారు. ఏడాది కాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటింటా అందిస్తున్న ఉచిత కరెంటు, రాయితీ గ్యాస్, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, కొత్త రేషన్‌కార్డులు, కుటుంబ సభ్యులు చేర్పులు, ఎకకాలంలో లక్ష రుణమాఫీ, రైతు ఆత్మీయ భరోసా వంటి పథకాలపై విస్తృత ప్రచారం చేపడుతూ భవిష్యత్‌లో ఇచ్చిన ప్రతి హామీ నేరవేరుతుందని భరోసా కల్పించాలన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలను గ్రామస్థాయిలో తిప్పికొట్టేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మండల బీసీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు కాడబోయిన గణేష్, భూక్య సజ్జన్, మండల నాయకులు బోనగిరి యాకస్వామి, దావెర అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీలు జాకీర్, రామచంద్రునాయక్, గ్రామ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు నేర్చుకోవాలి



జనగామ రూరల్: విద్యార్థులు జీవన నైపుణ్యాలు నేర్చుకోవాలని వాయిస్ ఫర్ గర్ల్స్ ఎన్జీఓ సంస్థ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ సూచించారు. బుధవారం పెంబర్తి గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో సంస్థ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, అనూష భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

దేవరుప్పుల: గంజాయి సరఫరా చేసే వ్యక్తిని అరెస్టు చేసి మంగళవారం రాత్రి రిమాండ్ చేసినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. ఇటీవల మండలంలోని సింగరాజుపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి వినియోగిస్తున్నారని అరెస్టు చేయగా వారికి జనగామకు చెందిన బత్తిని శ్రీకాంత్ సరఫరా చేస్తున్నట్టు తేలింది. ఈ విషయమై శ్రీకాంత్‌ను జనగామ కోర్టులో హాజరపర్చగా రిమాండ్‌కు ఆదేశించారు. యువత పెడదారిపట్టి మత్తు పదార్థాలు వినియోగిస్తే జైలు జీవితం అనివార్యమని హెచ్చరించారు.

ఆర్థికసాయం

నర్మెట: మచ్చుపహాడ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాయారపు చంద్రయ్య (65) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. కాగా, కాంగ్రెస్ యూత్ జిల్లా కార్యదర్శి ఫరీదుల లింగరాజు పార్టీ శ్రేణులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల సాయం అందజేశారు. మండల యూత్ అధ్యక్షుడు బుర్రా నరేష్ గౌడ్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బుర్రా రాజు, నాయకులు నాగపురి బాలరాజు, చింతకింది ప్రవీణ్, రాయారపు కొంరయ్య, నర్సయ్య, నాగరాజు, నరేష్ తదితరులు ఉన్నారు.

4 శాతం రిజర్వేషన్ కల్పించాలి

చిల్పూరు: తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన బేడబుడగ కులస్తులకు 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మోటం రాజు కోరారు. మండలంలోని రాజవరం గ్రామంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడం హర్షించదగిన విషయమన్నారు. కానీ, 15 ఉప కులాలతో గ్రూపు–1 గా చేసి తమకు 1 శాతం రిజర్వేషన్ ప్రకటించడం దారుణమన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మోటం రాములు, రవి, శ్రీనివాస్, వెంకటయ్య, దేవేందర్, రాజశేఖర్, ఉప్పలయ్య, ఎల్లయ్య, సుధాకర్, సురేష్, శివ, పవన్, ప్రవీణ్, జంపయ్య పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు రూ. 23 లక్షలు

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల బస్ స్టేజీ సమీపంలోని జాతీయ రహదారిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ. 23,83,731 రోడ్డు రవాణా, రహదారుల శాఖ కేంద్ర సహాయ మంత్రి హర్షమల్హోత్ర నిధులను మంజూరు చేసినట్లు గ్రామ యువ నాయకుడు ఆకుల సాయికిరణ్ తెలిపారు. ఢిల్లీలో బుధవారం కేంద్ర మంత్రిని సాయికిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ బస్ స్టేజీ సమీపంలో జాతీయ రహదారిలో సెంట్రల్ లైట్లు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించడం హర్షనీయమన్నారు.

సంక్షిప్త సమాచారం

పశు వైద్యశిబిరం

పాలకుర్తి: మైలారం గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి గూడూరు రమ్య.. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి రైతులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. లింగనిర్ధారణ వీర్యంతో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడదూడలు మాత్రమే పుడతాయని అన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. శివప్రసాద్, ఎంపటి రాజేశ్వర్‌రావు, సమ్మయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

బచ్చన్నపేట: పెండింగ్ బిల్లులు ఇవ్వాలని తలపెట్టిన ఛలో హైదరాబాద్‌ను అడ్డుకునేందుకు అక్రమ అరెస్టులు చేయడం సరికాదని మాజీ సర్పంచ్‌లు కోనేటి స్వామి, పస్తం మధుప్రసాద్‌లు అన్నారు. బుధవారం మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకతుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించిన అనంతరమే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని అన్నారు. తాతిరెడ్డి శశిధర్‌రెడ్డి, శివరాత్రి రాజనర్సు, ఆజామ్, పంజాల శ్రీధర్, మూసిని రాజు ఉన్నారు.

ఎమ్మెల్యే కడియం చిత్రపటానికి క్షీరాభిషేకం

లింగాలఘణపురం: మండలంలోని క్లైం–జీడికల్ రోడ్డు మరమ్మతుకు రూ.8 కోట్లు ఎంఆర్‌ఆర్(మెయింటెనెన్స్ రూరల్ రోడ్స్) పథకంలో మంజూరైన సందర్భంగా జీడికల్, రామచంద్రగూడెం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు రాజు, మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవరాయ రాజు, సంపత్, నర్సయ్య, లక్ష్మారెడ్డి, లింగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తోపాటు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్, మాధారం, సోమయ్యకుంటతండాలో వ్యవసాయ బావుల మూడు ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్‌ను ఇటీవల దుండగులు చోరీ చేసిన విషయం విదితమే. దీతో సాగు చేసిన వరి పంటలు ఎండు ముఖం పట్టడంతో అయా గ్రామాల రైతుల విజ్ఞప్తి మేరకు ఖిలాషాపూర్ ఏఈ రవీందర్ స్పందించారు. బుధవారం సిబ్బందితో మాధారం, ఇబ్రహీంపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను బిగించి విద్యుత్ పునరుద్ధరించారు. దీంతో బాధిత రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బియ్యం అందజేత

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన మొగిళిపాక మల్లేశం ఇటీవల మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న ఎంపీటీసీ జ్యోతి రజిత యాకయ్య, ఆర్టీసీ డ్రైవర్ పట్టపూరి దాస్ 50 కిలోల బియ్యం బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింగం, ఆర్టీసీ డ్రైవర్ నాగేష్, సురేందర్, మొగిళి, వెంకన్న ఉన్నారు.

7 నుంచి జిల్లాస్థాయి క్రీడలు

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జిల్లా స్థాయి గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఉద్దెమారి రాజ్ కుమార్, క్రీడల ఆర్గనైజర్, సెక్రెటరీలు అజయ్, రణదీప్, ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,016, ద్వితీయ రూ.15,016, తృతీయ బహుమతి రూ. 6,016 నగదు అందజేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

జఫర్‌గఢ్: జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సౌడ రమేశ్‌ను మండలానికి చెందిన పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా రమేశ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎండీ వలిపాషా, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నేరెళ్ల రాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

నివాళి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ సర్పంచ్ ఇల్లందుల ప్రతాప్ తల్లి అనసూర్య (96) బుధవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ మారపాక రవి, మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్, మాజీ ఎంపీటీసీలు గన్ను నర్సింహులు ఉన్నారు.

పరామర్శ

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటలో పరిదె కొమురయ్య మృతి చెందాడు. కాగా బుధవారం పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇర్రి రమణారెడ్డి, చెంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, సిద్దారెడ్డి, బాల్‌రెడ్డి, లావణ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పాలకుర్తి క్రీడాకారులు

పాలకుర్తి టౌన్: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలానికి చెందిన చిట్యాల రఘు(పాలకుర్తి), బాలబోయిన సందీప్(చెన్నూరు), కొంతం కుమార్ (ఈరవెన్ను) క్రీడాకారులు ఎంపికైనట్లు బుధవారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు ఎన్. భగత్, కొండా రవి ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 31వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ ఇనిస్టిట్యూట్ మైదానంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషులు, మహిళల సాఫ్ట్‌బాల్ ఎంపికపోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి క్రీడాకారులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 7,8,9 తేదీల్లో వరంగల్ జిల్లా బొల్లికుంటలోని వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో జరిగే 11వ రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నట్లు వారు తెలిపారు.



రఘు



బి.కుమార్



బి.సందీప్

'బీసీ కులగణన చరిత్రాత్మకం'

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో బీసీ కులగణ చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీశ్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే మొదటగా తెలంగాణలో కులగణన చేపట్టేలా కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితర మంత్రులకు బీసీల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు కులగణన సర్వేలో పాల్గొనకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తూ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు వైఖరి మార్చుకుని కులగణనలో అధికారులకు సహకరించాలని డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జనగామ రూరల్/తరిగొప్పుల: కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికను కేబినెట్, అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం తెలిపినందుకు గానూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బుధవారం నాయకులు స్వీట్లు పంపిణీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గణిపాక మహేందర్, మేడ శ్రీనివాస్, గాదెపాక రామచందర్ వగలబోయిన యాదగిరి, మంద చంద్రయ్య, కల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఐదుగురిపై కేసు నమోదు

రఘునాథపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని శారీరకంగా వాడుకుని పెళ్లికి నిరాకరిస్తూ మోసం చేసిన ఓ యువకుడిపై పోక్సో కేసు, అతడి కుటుంబ సభ్యులపై ఇతర కేసులు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ బుధవారం తెలిపారు. భీమదేవరపల్లి మండలం నరహరితండాకు చెందిన లావుడ్యా విజయ్‌కుమార్‌తో 2020లో మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో నిశ్చితార్థం అయింది. అదే రోజు వరకట్నం కింద రూ.లక్ష, ఆ తర్వాత ఇంటి నిర్మాణం కోసం రూ.2 లక్షలు, మొత్తం రూ.3 లక్షలు అప్పజెప్పారు. అమ్మాయి మైనర్ కావడంతో చదువులు పూర్తయ్యాక మేజర్ కాగానే పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఎలాగూ పెళ్లి చేసుకుంటానని విజయ్‌కుమార్ పలు మార్లు యువతిని శారీరకంగా వాడుకుని పెళ్లికి నిరాకరిస్తున్నాడు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా విజయ్‌కుమార్ తల్లిదండ్రులు సమ్మయ్య, రాజేశ్వరి, అక్క రమాదేవి, బావ రాజ్‌కుమార్‌లు కూడా పెళ్లికి నిరాకరించి అవమానిస్తూ దాడి చేశారని బాధిత యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విజయ్‌కుమార్‌పై పోక్సో కేసు, అతడి కుటుంబ సభ్యులపై ఇతర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 2004–05 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు సరోత్తంరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శాంతమణిలను సన్మానించారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

నర్మెట: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలని క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పోకల జమున, తాళ్ల సురేష్, పానుగంటి ప్రవీణ్, ఎండీ. యాకూబ్ పాషా, గులాం బాయ్, ధర్మపురి శ్రీనివాస్, బాల్దె కమలమ్మ, అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో మండల కేంద్రంలోని వినాయక గార్డెన్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను తుంగలోతొక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, రుణ మాఫీని పూర్తిగా అందించక రైతులను నిండా ముంచిందన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. గద్దల నర్సింగా రావు, ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి, పెద్ది రాజిరెడ్డి, నాయకులు ఎండి గౌస్, చింతకింది సురేష్, నక్కల రవి తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: సమావేశంలో పాల్గొన్న నాయకులు

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందేలా కార్యకర్తలు కృషి చేయాలని క్లస్టర్ ఇన్‌చార్జ్ గజ్జెల నర్సిరెడ్డి కోరారు. మండలంలోని కట్కూర్, అలీంపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నర్సిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడాల రాజు మాట్లాడారు. తిపారపు విజయ్, దామెర రాజు తదితరులు పాల్గొన్నారు.